# సైకో థెరపీ

సైకియాట్రిస్టు క్లినిక్‌లో పేషెంట్లు కూచునే గది క్రిక్కిరిసి వుంది.

ఆధునిక జీవనంలోని మానసిక ఒత్తిడిని ప్రతిఫలిస్తోంది ఆ గదిలోని వాతావరణం. ఉద్యోగంలోని టెన్షన్‌ని తట్టుకోలేనివారూ. పరీక్ష ఫెయిలయితే తల్లితండ్రుల ప్రేమనే కోల్పోతామని భయపడే పిల్లలూ, సంసారంలో సర్దుబాటు తక్కువైన భార్యాభర్తలూ, కొడుకులు తమను పట్టించుకోడం లేదని బాధపడే వృద్ధులూ, సెక్సు సంబంధమైన భయాలున్న యువకులు గదిలో కూర్చుని డాక్టరుగారి కోసం ఎదురుచూస్తున్నారు.

"మూడు గంటలకే క్లినిక్ తెరుస్తారని బోర్డులో ఉంది. డాక్టరింకా వచ్చినట్లు లేదు. లేటుగా రావడం మామూలేనా? ఎదురు చూస్తున్న ఒకావిడ అసహనంగా పక్కనున్న పేషెంటుని ప్రశ్నించింది.

"టైమింకా రెండుముప్పావేగా అయింది. డాక్టరుగారు రెండు, మూడు పాలిక్లినిక్‌లలోనూ, హాస్పిటల్స్‌లోనూ కన్సల్టెంట్‌గా పని చేస్తున్నారు. ఇంక వచ్చేస్తారేమో?"

గేటు దగ్గర కారు హారన్ వినిపించేసరికి వెయిటింగ్ రూంలో నిశ్శబ్దం ఏర్పడింది. పని కుర్రాడు వెళ్ళి గేటు తీశాడు. డాక్టరు అర్జున్ కారుని లోపల పార్కుచేసి "పది నిముషాలలో వచ్చేస్తాను. వచ్చిన వాళ్ళందరినీ వరసగా లోపలికి పంపించు" అంటూ ఇంటివైపుకి వెళ్ళేడు.

ఎదురు చూస్తున్న పేషెంట్లకు విసుగు తగ్గి, ప్రశాంతత కలిగింది.

❖ ❖ ❖

అర్జున్ లోపలకు వెళ్ళేసరికి, అతని భార్య ఎదురై "ఈ రోజు అన్నీ స్పెషల్స్ చేశాను. ఎందుకో తెలుసా? అంది.

డైనింగ్ టేబిల్ ముందు కూర్చుంటూ, "తెలియదు. ఎందుకు?" అన్నాడు.

కరుణ మాట్లాడకుండా అతని కంచంలో బిరియానీ, ఆవడ, గులాబ్‌జాం వడ్డించింది. అతను ఆదరాబాదరాగా తింటూ "ఎందుకు చేశావు స్పెషల్స్" అన్నాడు.

గడియారం మూడు కొట్టడానికి నిముషం మాత్రమే మిగిలింది.

కరుణ కోపంగా "నేను చెప్తే మాత్రం మీరు వింటారా?" అంది.

అర్జున్ "వినకుండా ఎందుకుంటాను? చాలామంది పేషెంట్స్ వున్నారు. రాత్రి వచ్చాక చెప్పువుగానీ" అంటూ చెయ్యి కడిగేసుకుని లేచి క్లినిక్ వైపు వెళ్ళిపోయాడు.

మొదటి వడ్డించినది మాత్రమే తినేసి. ఇంకొంచెం కావాలనైనా అడక్కుండా లేచి వెళ్ళిపోయిన భర్తను తల్చుకుని బాధగా నిట్టూర్చింది కరుణ.

❖ ❖ ❖

పేషెంట్లు వరుసగా లోపలకు వచ్చి వెడుతున్నారు. ప్రతి ఒక్కరి సమస్యనూ శ్రద్ధగా విని తగు సూచనలిస్తున్నాడు అర్జున్. ఇద్దరు మగవాళ్ళూ ఇద్దరు ఆడవాళ్ళూ లోపలకు వచ్చారు. ఒకటి మధ్య వయస్సు జంట, ఒకటి కొత్తగా పెళ్ళయిన జంటలా వుంది. నలుగురూ కూచున్నాక, అర్జున్ "విషయం చెప్పండి" అన్నాడు.

నలుగురూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు కానీ మాట్లాడలేదు.

"విషయం చెప్పండి. మొహమాటం దేనికి" అన్నాడు డాక్టర్ మృదువుగా.

మగవాళ్ళలో పెద్దతను మాట్లాడేడు. "ఈమె నా భార్య చెల్లెలు. ఇతను ఆవిడ భర్త. వీళ్ళకి పెళ్ళయి రెండేళ్ళయింది."

మాట్లాడడం, అపి ఇబ్బందిగా చూస్తున్న అతనితో "ఫరవాలేదు చెప్పండి" అన్నాడు.

"ఈమె నా భార్య" అంటూ ఆడవాళ్ళలో రెండో ఆవిడను చూపించాడు.

సమస్యలు చెప్పకోడానికి మొదట్లో చాలా సిగ్గుపడతారు. సైకియాట్రిస్ట్‌కి అది అనుభవమైన విషయమే. అర్జున్ మాట్లాడకుండా "మెల్లిగా చెప్పచ్చుతొందరేం లేదు" అన్నట్లుగా కూచున్నాడు.

పెద్దతను మళ్ళీ మాట్లాడేడు. "పెళ్ళయి రెండేళ్ళయినా వీళ్ళ మధ్య సంసారబంధం లేదు."

ఇంతకన్నా క్లియర్‌గా చెప్పలేనన్నట్లుంది అతని మొహం.

అర్జున్ పెద్ద జంటతో "మీరు కొంచెం సేపు బయట వెయిట్ చెయ్యండి. పిల్లలు మీ ఎదురుగా మాట్లాడ్డానికి సిగ్గుపడతారు కదా" అన్నాడు.

వాళ్ళిద్దరూ బయటకు వెళ్ళిపోయారు.

అర్జున్ అమ్మాయికేసి చూసి "మీరు చెప్పండి" అన్నాడు.

ఆ అమ్మాయి "నాకు చాలా భయం" అంది బెరుగ్గా.

"మీది పెద్దలు కుదిర్చిన పెళ్ళా? మీ ఇష్టానికి వ్యతిరేకంగా జరిగిందా?"

"చిన్నప్పటినుంచీ అనుకున్నదే. ఆయన వరసకి నాకు బావ అవుతారు."

"మీ వారితో మాట్లాడాలి. మీరు బయట వుండండి".

ఆ అమ్మాయి బయటకు వెళ్ళిపోయాక అబ్బాయితో "మీరు చెప్పండి సార్. ఆవిడ ఎందుకు భయపడుతున్నారు?" అన్నాడు.

"ఏమో తెలియదు. తను చాలా భయపడుతోంది" అన్నాడతను. ఆ యువకుడి కంఠంలో కూడా భయం తెలుస్తోంది.

"మీరు భయాన్ని పోగొట్టే ప్రయత్నం చెయ్యలేదా?"

"తనకెప్పుడు భయం తగ్గితే అప్పడే మేము సంతోషంగా వుంటాము. ఇంతదాకా నేను ఆగుతాను."

"మీరు ఆగగలగడం మంచిదే. కానీ పిల్లలు పుట్టడం మరీ ఆలస్యం కాకూడదేమో."

"దానికేముంది డాక్టర్ నేను మా అమ్మకి నలభై రాబోతుండగా పుట్టాను."

డాక్టర్ మెదడులో మెరుపు మెరిసింది. "మీరెంత మంది పిల్లలు?"

"నేను ఒక్కణ్ణే."

"మీ చిన్నతనం గురించి చెప్పండి."

ఆ యువకుడు ఉత్సాహంగా "మా అమ్మ చాలా మంచిది" అంటూ తన చిన్ననాటి విషయాలూ, తన తల్లి తనను ఎంత గారంగా పెంచిదీ, ఈనాటికీ తన కాలిలో ముల్లు కూడా దిగకుండా తనను ఎంత కాపాడుతున్నదీ చెప్పేడు.

అర్జున్‌కి కేసు అర్థమయింది. తమ అతి ప్రేమతో, అతి జాగ్రత్తతో తల్లులు బిడ్డల భవిష్యత్తును ఎంతగా నాశనం చేస్తారో అతనికి వృత్తిరీత్యా అనుభవంలో వున్న విషయం. అతి గారంగా పెరిగిన పిల్లలు... అందునా మగ పిల్లలు... ఆత్మ విశ్వాసాన్ని కోల్పోతారు. చొరవ చూపించాల్సినచోట వెనకంజ చేస్తారు. ఇతనికి మెల్లిగా ధైర్యంగా ఉండడం నేర్పాలి.

"మీరు మళ్ళీ ఎల్లుండి సాయంత్రం రండి". ఆ యువకుడు బయటకు వెళ్ళిపోయాడు.

తరువాత లోపలకు వచ్చిన భార్యాభర్తలను చూడగానే అర్జున్‌కి కేసు గుర్తొచ్చింది. ఇంట్లో సామాను ఎక్కడపడితే అక్కడ పడేస్తారనీ, ఇల్లు అందంగా ఉంచడంలో తనకే మాత్రం సాయం చెయ్యరనీ భార్య విసుక్కునేది. ఎప్పుడూ పని చెయ్యమని

పీక్కుతింటుందని భర్త కోపగించుకునేవాడు. భార్యభర్తల మధ్య నిత్యం యుద్ధం జరుగుతూ ఉండేది.

సమస్యను విశ్లేషించగా భార్య విసుగుకి అసలైన కారణం భర్త గృహాలంకరణలో సాయం చెయ్యకపోవడం కాదనీ, ఆమెకు కోరుకున్నంతగా భర్త అనురాగం లభించడం లేదనీ తెలిసింది. నిజమైన కారణం తెలిశాక భర్తకు ఆమెపై కోపం పోయింది. ఆఖరుసారిగా ఈ రోజే వచ్చారు.

"ఎలా వుందిప్పుడు"

"చాలా హాపీగా ఉన్నాం" ఇద్దరూ కోరస్‌గా అన్నారు.

ఆనందం శాశ్వతంగా ఉండడానికి మరికొన్ని సూచనలిచ్చాడు డాక్టర్.

వరసగా పేషెంట్లు వస్తున్నారు. టైం రాత్రి తొమ్మిది కావస్తోంది. పని కుర్రాడు లోపలకు వచ్చి "ఇంకొకళ్ళే వున్నారు సార్. ఎవరో ముస్లిం ఆవిడ" అన్నాడు.

అర్జున్ కొంత ఆశ్చర్యపడి "లోపలకు పంపించు" అన్నాడు.

ఒకావిడ లోపలకు వచ్చి కూర్చుంది. పూర్తిగా బురఖా వేసుకోడం వల్ల ముఖం కూడా కన్పించడం లేదు.

"చెప్పండి" అన్నాడు అర్జున్. సంభాషణ హిందీలో సాగుతోంది.

"మీరు ఆల్కహాలిజంకి డి అడిక్షన్ చేస్తారు కదా"

భర్తల చేత తాగుడు మాన్పించే ప్రయత్నంలో చాలామంది భార్యలు తమ భర్తలను తీసుకొస్తూ ఉంటారు. ఈవిడ ఒక్కర్తే వచ్చిందేమిటి? కొంపదీసి ఈవిడకే అలవాటుందా?

మనస్సులోని భావాలను బయటపడనివ్వకుండా "అవును" అన్నాడతను.

"వర్కహాలిజమ్‌కి కూడా చేస్తారా"

"మీ పేరు..."

"ఆలి ముస్నీసా."

పేరు చెపుతున్నప్పుడు కంఠం కొద్దిగా వణికినట్లుంది. అసలు పేరు చెప్పడం లేదా? గొంతు కూడా విన్నట్లుందేమిటి. మనుషుల్ని పోలిన మనుషులన్నట్లే. గొంతుని పోలిన గొంతులూ ఉంటాయి.

"వర్క హాలిజమ్‌కి డి అడిక్షన్ చెయ్యమన్నారు. ఎవరికి చెయ్యాలి? వివరంగా చెప్పండి."

"మావారికేనండి. ఆయనకు ఆయన ఉద్యోగం తప్ప నేను అస్సలు పట్టను".

చాలామంది స్త్రీలకుండే కంప్లయింటే.

"మీ వివాహమై ఎన్ని సంవత్సరాలయింది?"

"అయిదేళ్ళు. ఈ అయిదు సంవత్సరాలలో మేమిద్దరం కల్సి బయటకు వెళ్ళింది అయిదుసార్లు కూడా ఉండదు. ఫామిలీలో పెళ్ళిళ్ళకీ, ఫంక్షన్లకీ నేను ఒక్కర్తినే వెడుతుంటాను. మావాళ్ళంతా మీ ఆయన ఒక్కడికేనా ఉద్యోగముంది. మేమంతా జాబ్స్ చెయ్యడం లేదా అని నన్ను వెక్కిరిస్తూంటారు."

"మీ స్పెండింగ్ హాబిట్స్‌ని ఆయన విమర్శిస్తారా?"

"లేదు ఆయన సంపాదన ఎక్కువ అవడం వల్లనో, నాకు ఖర్చు పెట్టే అలవాటు తక్కువ కావడం వల్లనో తెలియదు కానీ ఆ విషయంలో మాకు ప్రాబ్లెం లేదు."

"మీ మధ్య సంసారబంధం ఎలా వుంటుంది?"

ఆమె ఒక్క క్షణం తటపటాయించి "ఆ విషయంలో నాకు అసంతృప్తి లేదు" అంది.

కొంచెం సేపు ఆమె మాట్లాడింది. "నిజానికి నాకు ఏ విషయంలోనూ బాధ ఉండకూడదేమో. డబ్బుకి ఇబ్బంది లేదు. ఆయనకే దుర్వ్యసనాలూ లేవు. ఆరోగ్యం బాగుంది. అన్నీ ఉన్నాయి అల్లుడి నోట్లో శని ఉన్నట్లుగా ఉంటుంది. రోజులో కొంత టైమైనా నాకు కేటాయించవచ్చు కదా. ఎందుకీయనకు నాతో సమయం గడపాలని లేదు అని బాధపడుతూ వుంటాను. నాలో ఏదో లోపం ఉండే వుంటుంది. లేకపోతే ఆయన ఎందుకు నాతో ఉండరు?"

అర్జున్ మాట్లాడలేదు. ఆమె మనస్సులోని బాధంతా బయటకు వచ్చేస్తే మంచిది.

"ఈ రోజు మా పెళ్ళిరోజు. ఈవేళ కూడా ఆయన నాతో పది నిముషాలైనా మాట్లాడలేదు. ఈ సంవత్సరమే కాదు ఎప్పుడూ నా పుట్టినరోజుకానీ, పెళ్ళిరోజుకానీ ఆయనకు పట్టవు. ఒంటరితనమే నాకు రాసి పెట్టి వుంది."

ఆమె మరికొంతసేపు భర్త నిర్లక్ష్యం గురించి మాట్లాడింది

"ఈ విషయం మీరెప్పుడైనా ఆయనతో చర్చించేరా?"

"ఆయనకు తీరిక ఉంటేకదా?"

"రాత్రి సమయంలో..."

"చెప్తే లాభం ఉంటుందంటారా?"

"మీరు మంగళవారం మళ్ళీరండి. ఈసారి వారిని తీసుకురండి. అప్పడే నాకు పని సులువవుతుంది."

"చెప్పే వస్తారో లేదో."

"ప్రయత్నించండి. ఎదుటివాళ్ళకి మన మనస్సును చదివేశక్తి ఉంది అని అనుకోకూడదు. మీరు చెప్పకుండా ఆయనకు మీ అసంతృప్తి ఎలా తెలుస్తుంది? మీరు ఆనందంగా వున్నారనే ఆయన అనుకుంటున్నారేమో. ఈ రోజు మీ పెళ్ళిరోజని మీరు ఆయనకు చెప్పారా?"

"నేను చెప్పాలా? నాకు గుర్తున్నది ఆయనకి ఎందుకు గుర్తుండదు? ఇద్దరికీ కలిసి ఒక్కసారే పెళ్ళయింది."

ఆమె కంఠంలో ఆవేశం తుఫాను వీచినట్లుంది.

"మీరు చెప్పింది నిజమే. కానీ ప్రపంచంలో అందరూ ఒక్కలా వుండరు కదా. ప్రొద్దుటే మీరు ఈ రోజు మన పెళ్ళిరోజు, కలిసిపోయిగా ఎంజాయ్ చేద్దాం అంటే ఆయన ఒప్పకునేవారేమో."

ఆమె ఆలోచనలో పడ్డట్లుగా మాట్లాడలేదు.

"మంగళవారం మీవారిని కూడా తీసుకురండి. ఆయనతో కూడా మాట్లాడతాను."

"ప్రయోజనం ఉంటుందంటారా?"

ఆమె కంఠంలో పరిహాసం కదలాడింది. అర్జున్‌లో ఎందుకో అనుమానం కలిగి, ఆమెవైపు పరీక్షగా చూశాడు.

ఆమె నిలబడి, బురఖా తీసేస్తూ "ప్రియమైన శ్రీవారూ, ఈ రోజు మన పెళ్ళిరోజు" అంది.

అతను ఆశ్చర్యంగా "కరుణా నువ్వా" అన్నాడు.

ఆమె నవ్వుతూ, "నేను మామూలుగా ఇంట్లో మాట్లాడితే మీరు నేను చెప్పేది వింటారా? అందుకే పేషెంట్‌గానే వచ్చాను. సైకోథెరపీ పని చేస్తుందో లేదో చూడాలి. నా కష్టం మీకు తెలిసిందో లేదో" అంది.

"ఇంట్లోకి పద. థెరపీ ఎంతవరకు పని చేసిందో. ఎవరు ఎవరికి థెరపీ చేశారో చూద్దాం."

(మయూరి వీక్లీ)